# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

## ఉద్యోగులు అభివృద్ధిలో భాగమవ్వాలి: సీఎస్ సోమేశ్‌కుమార్



హైదరాబాద్ , సెప్టెంబర్ 2: ఉద్యోగులు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఎస్ సోమేశ్‌కుమార్ అన్నారు. పదోన్నతులు కల్పించినందుకు సీఎస్ సోమేశ్ కుమార్‌కు సచివాలయ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. గురువారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో సీఎస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎస్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగులు సమర్థంగా, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలకనుగుణంగా పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఉద్యోగులకు సాధారణ పరిపాలనా శాఖ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సీఎస్ సూచించారు.

హైదరాబాద్ | శుక్రవారం 3-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 28 | పేజీలు: 4 | వెల: రూ.1/-

# తెలంగాణ భవన్ భూమిపూజలో పాల్గొన్న సీఎం కేసీఆర్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: తెలంగాణ ప్రగతిలో మరో ఘట్టం ఆవిష్కృతమైంది. తెలంగాణ రథసారథి సీఎం కేసీఆర్ మరో ప్రస్థానానికి నాంది పలికారు. దేశ రాజధాని ఢిల్లీలో .. తెలంగాణ భవన్ నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయానికి ఇవాళ శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన భూమి పూజలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఆయనతో తెలంగాణ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రతినిధులు ఆ వేడుకకు హాజరయ్యారు. వేద మంత్రోచ్ఛరణ మధ్య భూమి పూజ నిర్వహించారు. తెలంగాణ భవన్ నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమాన్ని వసంత్ విహార్‌లో చేపట్టారు.

ఢిల్లీలోని వసంత్ విహార్ వేదఘోషతో మారుమోగింది. ఆ ప్రాంతంలో ఉన్న సుమారు 1100 చదరపు మీటర్ల ప్రాంగణంలో తెలంగాణ భవన్‌ను నిర్మించనున్నారు. త్రీ ప్లస్ త్రీ రీతిలో భవనాన్ని కట్టనున్నారు. ఇవాళ భూమి పూజ సమయంలో ముందుగా సీఎం కేసీఆర్ హోమంలో పాల్గొన్నారు. వేద వచనాలతో వసంత్ విహార్ వెల్లువిరిసింది. పండితులు మంత్రోచ్ఛరణతో శుభసందేశాలిచ్చారు. మంగళకరమైన దీవెనలతో ఆ ప్రాంగణం దివ్యవెలుగులు చిమ్మింది.

## ఢిల్లీలో తెలంగాణ భవన ఆత్మగౌరవానికి చిహ్నం : కేటీఆర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: 2001లో ఒక్క అడుగుతో ప్రారంభమైనటువంటి టీఆర్‌ఎస్ పార్టీ ప్రస్థానం.. ఈ 20 ఏండ్లలో అంచెలంచెలుగా ఎదిగి ఢిల్లీ నగరం నడిబొడ్డుకు చేరింది. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణానికి భూమి పూజ చేయడం గర్వంగా ఉందని, ఆ భవనం తెలంగాణ ఆత్మగౌరవానికి చిహ్నం అని టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ చరిత్రలో ఈ రోజు శాశ్వతంగా నిలిచిపోతోందని ఆయన అన్నారు. దక్షిణాది నుంచి టీఆర్‌ఎస్ మాత్రమే ఢిల్లీలో పార్టీ భవనం ఏర్పాటు చేస్తోంది. టీఆర్‌ఎస్ మాత్రమే పార్టీ భవనం ఏర్పాటు చేయడం గర్వకారణం అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఢిల్లీలోని వసంత్ విహార్‌లో తెలంగాణ భవన్‌కు సీఎం కేసీఆర్, కేటీఆర్ భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి టీఆర్‌ఎస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. భూమి పూజ కార్యక్రమం ఓ పండుగలా కొనసాగింది.

## ఢిల్లీలో టీఆర్ఎస్ పార్టీ ఆఫీసుకు భూమి పూజ.. ఎన్నారైలు హర్షం

హైదరాబాద్ , సెప్టెంబర్ 2:దేశ రాజధాని ఢిల్లీలో టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నిర్మాణానికి సీఎం కేసీఆర్ భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల హర్షం వ్యక్తం చేశారు. నాడు 2001 ఏప్రిల్ 27న గుప్పెడు మందితో తెలంగాణ నడిబొడ్డున జల దృశ్యంలో ఊపిరి పోసుకున్న టీఆర్‌ఎస్.. నేడు 2021 సెప్టెంబర్ 2న దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున సగర్వంగా టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం భవనానికి సీఎం కేసీఆర్ భూమిపూజ చేయడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది ఒక్క టీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే అని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వం వర్థిల్లాలి అని మహేష్ బిగాల ఆకాంక్షించారు.

## కేంద్ర పురావస్తు శాఖ డీజీకి మంత్రి శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: ఢిల్లీలో కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ విద్యావతిని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో తెలంగాణలోని రామప్ప దేవాలయానికి యునెస్కో ప్రత్యేక గుర్తింపు కల్పించినందుకు విద్యావతిని మంత్రి శ్రీనివాస్ గౌడ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగువారై ఉండి ఈ గుర్తింపు రావడం కోసం కృషి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలోని గోల్కొండ , వేయి స్తంభాల గుడి, బాసర , చార్మినార్‌కు కూడా ప్రత్యేక గుర్తింపు కల్పించవలసిందిగా యునెస్కో కు ప్రతిపాదన పంపాలని వారిని కోరారు. హైదరాబాదులోని గోల్కొండలో గల సౌండ్ అండ్ లైట్ షోను నవీకరణ చేయాలని, ప్రస్తుతం ఉన్న ప్లేస్ నుండి పర్యాటకులకు అనువుగా ఉండే రాణి మహల్‌కు మార్చాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

యాదాద్రి, భద్రాచలం ,మహబూబ్ నగర్ లోని మన్యంకొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానం సందర్శించవలసిందిగా భారత పురావస్తు సర్వే (యాఎ) బృందాన్ని కోరారు . ఆ దేవాలయాల అభివృద్ధికి నిధులను విడుదల చేయవలసిందిగా కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేసి అధునాతన టెక్నాలజీ ద్వారా నిర్మింపజేసిన యాదాద్రి దేవాలయాన్ని సందర్శించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం ఎండీ మనోహర్, ఈడీ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌పై చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ఆగ్రహం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:వెబ్ పోర్టల్స్, సోషల్ మీడియాల్లో వ్యాప్తి చెందుతున్న నకిలీ వార్తల పట్ల ఇవాళ సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి సంస్థల్లోనూ నకిలీ వార్తలు వ్యాపిస్తున్నాయనీ, ఇలాంటి సంస్థలు జడ్జిలకు కూడా స్పందించడంలేదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఎఫ్‌బీ, ట్విట్టర్, యూట్యూబ్ లాంటి సంస్థలు కేవలం శక్తివంతమైన మనుషులకు మాత్రమే స్పందిస్తున్నాయని, న్యాయవ్యవస్థల పట్ల సోషల్ మీడియా సంస్థలకు జవాబుదారీతనం లేదని సుప్రీంకోర్టు వెల్లడించింది. ట్విట్టర్, ఎఫ్‌బీ, యూట్యూబ్ లాంటి ఛానళ్లు న్యాయవ్యవస్థ పట్ల స్పందన ఇవ్వడం లేదని, న్యాయవ్యవస్థ గురించి అవి చెడుగా రాశాయని, స్పందించకపోవడమే కాకుండా, అది తమ హక్కుగా పేర్కొంటున్నాయని చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ తన తీర్పులో పేర్కొన్నారు.కోవిడ్19 వ్యాప్తికి ఢిల్లీలో మార్చి 2020లో జరిగిన తబ్లిగ్ జమాత్ కారణమని సోషల్ మీడియాలో వార్తలు వ్యాపించాయి. దానిపై వేసిన పిటిషన్లను ఇవాళ సుప్రీం విచారించింది. ఈ సందర్భంగా ఎన్వీ రమణ వ్యాఖ్యానిస్తూ.. అలాంటి సందర్భాల్లో సోషల్ మీడియా వేదికల్లో వార్తలకు మతం రంగు పూస్తున్నారని అన్నారు. మీరు యూట్యూబ్‌లో చూస్తే తెలుస్తుంది, దాంట్లో ఎంత ఫేక్ న్యూస్ ఉంటుందో, వెబ్ పోర్టల్స్‌ను నియంత్రించే సంస్థలు లేవు, ప్రతివార్తకు మత కోణాన్ని చూపిస్తున్నారని, అదే సమస్య అని, ఇది దేశానికి చెడు పేరు తీసుకువస్తుందని చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. 2021 ఐటీ చట్టం సోషల్ మీడియాను నియంత్రిస్తుందని సోలిసిటర్‌జనరల్ తుషార్ మెహతా సమాధానం ఇచ్చారు. మళ్లీ ఆరు వారాల్లోగా ఈ కేసులో విచారణ చేపట్టనున్నట్లు సీజే తెలిపారు.

# భీకర వానలతో న్యూయార్క్ అస్తవ్యస్తం..



న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ అల్లకల్లోలమైంది. భీకర వానలు.. ఆకస్మిక వరదలు పోటెత్తడంతో.. నగరమంతా జలమయం అయ్యింది. దీంతో ఆ నగర మేయర్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఇదా తుఫాన్ వల్ల అమెరికాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే చరిత్రలో ఎన్నడూ లేనంతగా న్యూయార్క్‌లో వర్షం కురిసినట్లు మేయర్ బిల్ డీ బ్లాసియో తెలిపారు. రోడ్లపై అత్యంత ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నట్లు ఆయన వెల్లడించారు. అతి క్రూరంగా కురిసిన వాన వల్ల.. సబ్ స్టేషన్లు, ఇండ్లు, రోడ్లు అన్నీ నీటమునిగాయి. సోషల్ మీడియాలో వాటికి సంబంధించిన ఫూటేజ్ వైరల్ అవుతోంది.న్యూజెర్సీ అంతటా ఎమర్జెన్సీ ప్రకటించారు. వానల వల్ల ఒకరు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. పాసైక్ వద్ద ఓ వ్యక్తి నీటిలో మునిగిపోయాడు. ముల్లికా హిల్ వద్ద ఓ టోర్నాడో సుమారు తొమ్మిది ఇండ్లను నేలమట్టం చేసింది. న్యూజెర్సీలోని కేర్నీలో పోస్టల్ ఆఫీసు బిల్డింగ్ కూలిపోయింది. ఆ సమయంలో దాంట్లో తొమ్మిది మంది ఉన్నారు. రెస్క్యూ సిబ్బంది శిథిలాలను తొలిగిస్తున్నారు.

న్యూయార్క్‌లో ఉన్న సెంట్రల్ పార్క్‌లో ఒక గంటలోనే 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు వెదర్ సర్వీస్ పేర్కొన్నది. నగర ప్రజలు ఎవరూ రోడ్లమీదకు రావద్దు అంటూ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది కూడా బిజీగా ఉంది. న్యూయార్క్‌లో సబ్‌వే సర్వీసులను పూర్తిగా మూసివేశారు. న్యూయార్క్, న్యూజెర్సీ నుంచి వెళ్లే రైలు, విమాన సర్వీసులను కూడా రద్దు చేశారు.

## ప్రసార భారతి నియామకాలు 2021

### -స్ట్రింగర్ల ఎంపిక కోసం నోటిఫికేషన్

హైదరాబాద్ , సెప్టెంబర్ 2: హైదరాబాద్‌లోని దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్తల విభాగం స్ట్రింగర్ల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎంపికైన అభ్యర్థులు ఒప్పంద తేదీ నుండి రెండేళ్లపాటు కొనసాగుతారు. ప్రస్తుతం పని చేస్తున్న స్ట్రింగర్‌లు కూడా, ఈ కొత్త ఎంపానెల్‌మెంట్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. అభ్యర్థులు తమ దరఖాస్తులను 30.09.2021 సాయంత్రం 5 గంటల లోపు హైదరాబాద్ రామాంతపూర్ లోని దూరదర్శన్ కేంద్రానికి పోస్ట్ ద్వారా లేదా స్వయంగా అందించవచ్చు. స్ట్రింగర్ల ఎంపికకు కావలిసిన విద్యార్హత, అనుభవం, ఎంపిక విధానం తో పాటు పూర్తి వివరాల కోసం ప్రసార భారతి అధికారిక వెబ్‌సైట్ లేదా http://prasarbharati.gov.in/pbvacancies లింక్ ద్వారా పొందవచ్చు.

## రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ : రాజ్‌నాథ్ సింగ్





అహ్మదాబాద్, సెప్టెంబర్ 2:: రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్‌ను బలోపేతం చేయడంతో పాటు రక్షణ రంగ ఎగుమతులను ప్రోత్సహిస్తామని అన్నారు. డిఫెన్స్ ఎక్స్పో 2022 నిర్వహణపై గుజరాత్ ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వ శాఖ మధ్య గుజరాత్‌లోని కేవడియ వద్ద రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో సంతకాలు జరిగాయి.

గుజరాత్‌లోని గాంధీనగర్‌లో వచ్చే ఏడాది మార్చి 11-13 తేదీల్లో డిఫెన్స్ ఎక్స్పో జరగనుంది. గ ఏడాది డిఫెన్స ఎక్స్‌పోలో 70 దేశాలు పాల్గొనగా వచ్చే ఏడాది ఈ ప్రదర్శనలో 100 వరకూ దేశాలు పాలుపంచుకుంటాయని ఆశిస్తున్నామని మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. డిఫెన్స్ ఎక్స్‌పో2022 భారత్‌ను మిలటరీ హార్డ్‌వేర్ తయారీ హబ్‌గా ప్రపంచం ముందు ఆవిష్కరించేందుకు చర్యలు చేపట్టేలా రక్షణ మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది.

## తెలంగాణలో ఎల్లుండి భారీ వర్షాలు

హైదరాబాద్ , సెప్టెంబర్ 2: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. సముద్ర మట్టానికి 1.5 నుంచి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇవాళ, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఎల్లుంటి ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో చాలా చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉంది అని అధికారులు పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## ఈడీ విచారణకు హాజరైన నటి ఛార్మి



హైదరాబాద్ , సెప్టెంబర్ 2:టాలీవుడ్ డ్రగ్స్ కేసులో 12మంది సెలబ్రిటీలకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్(ఈడీ) ఇటీవల నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం డైరెక్టర్ పూరీ జగన్నాథ్?ను ఈడీ విచారించింది.

దాదాపు 10 గంటలకు పైగా ఈడీ అధికారులు పూరీ ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయనకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్స్, మనీ ట్రాన్స్‌ఫర్ వంటి అంశాలపై ఈడీ లోతుగా విచారించినట్లుగా తెలుస్తోంది.

ఇక ఈ రోజు నటి ఛార్మిని విచారించనున్నారు అధికారులు. ఇందులో భాగంగా కాసేపటి క్రితం ఛార్మి ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఛార్మి తో పాటు విచారణకు ఆమె చార్టెడ్ అకౌంటెంట్ సతీష్ కూడా ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. మరోవైపు ఆమెతో పాటు 15 మంది బౌన్సర్స్ ఈడీ కార్యాలయం దగ్గరకి చేరుకొని హంగామా సృష్టించినట్టు తెలుస్తుంది.

పూరీ జగన్నాథ్‌తో కలిసి పని చేస్తున్న ఛార్మీని ఈడీ అధికారులు డ్రగ్స్ కేసులో ప్రశ్నలు సంధించడంతో పాటు బ్యాంక్ లావాదేవీల వివరాలపై ఆరా తీయనున్నారు.

ఇప్పటికే పూరీ జగన్నాథ్, ఛార్మి నిర్మాతలుగా కొన్ని సినిమాలు నిర్మించారు. దీంతో ఇద్దరి బ్యానర్లకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న డ్రగ్స్ పెడ్లర్ కెల్విన్ అప్రూవర్‌గా మారడంతో పలువురు టాలీవుడ్ నటీనటుల పేర్లు బయటకి వచ్చాయి.

కెల్విన్ అకౌంట్లో ఛార్మి డబ్బులు వేసిందా కెల్విన్‌తో ఆమెకు పరిచయం ఉందా ? ఛార్మీ కెల్విన్ అకౌంట్?కు మనీ ట్రాన్స్‌ఫర్ చేసింది నిజమేనా ? అన్న కోణంలోనూ ఈడీ విచారించనున్నట్లుగా తెలుస్తోంది.

### చరిత్రలో నేటినిజం



కం॥ విమలమ్ముగ కాంగ్రెస్సున
కమతిన సేవల నాసంగి యాత్మీయుండై
కమలాపతికి త్రిపాఠికి
సమదర్శను డాసగు గాత శశ్వత్కీర్తిన్

( సెప్టెంబర్ 3 కమలాపతి త్రిపాఠి జన్మదినోత్సవం..)

-రాధశ్రీ



సెల్: 9494481210

# నేడు ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్‌ల ప్రభుత్వం ఏర్పాటు

అఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ముస్లింలకు పవిత్రదినమైన శుక్రవారం రోజు(రేపు) ప్రార్ధనల అనంతరం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అఫ్గాన్ నుంచి అమెరికా తన సైన్యాలను వెనక్కి తీసుకెళ్లిన తర్వాత అఫ్గాన్ పూర్తిగా తాలిబన్ల ఆధీనంలోకి వెళ్లిపోయింది.

తమ దేశం నుంచి సురక్షిత రాకపోకలకు హామీ ఇచ్చిన తాలిబన్లు కాబూల్ విమానాశ్రయాన్ని మాత్రం మూసే ఉంచారు.

ఏడాది ఆగస్టు 14న ఆఫ్ఘనిస్తాన్‌ను తాలిబన్లు పూర్తిగా ఆక్రమించారు. స్వల్ప వ్యవధిలోనే దేశం మొత్తాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోగలిగారు. తాలిబన్లతో పోరాడలేక సైన్యం చేతులెత్తేయడంతో వారి పని మరింత సులువైంది. ప్రస్తుతం ప్రభుత్వ ఏర్పాటుపై ఫోకస్ చేసిన తాలిబన్లు? పాలనకు సంబంధించి ఎటువంటి పాలసీలు రూపొందించబోతున్నారనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మహిళల హక్కులపై మొదటి నుంచి ఆందోళన వ్యక్తమవుతూనే ఉంది. స్త్రీలకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెబుతూనే? వారిని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల నుంచి ఇంటికి పంపించిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

## ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

నిజామాబాద్, సెప్టెంబర్ 2: ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గిపోవడంతో ఎస్సారెస్పీ గేట్లను గురువారం మూసి వేసినట్లు ఈఈ చక్రపాణి తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 6,720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 1090.7 అడుగుల (88.662 టీఎంసీలు) నిల్వ ఉంది. జెన్‌కోకు 2,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గతేడాది ఇదే రోజున 1089.80 అడుగుల (83.772 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

# నేటి ఈ-వ్యర్థాలు రేపటి తరానికి శాపాలు

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు మానవాళి జీవితంలో ఎన్నో మార్పులు, ఎంతో విప్లవాత్మక పరిణామక్రమం సజీవ చరిత్రగా నిక్షిప్తమైంది. కుటుంబానికి రేడియో విలాసవంతమైన ఉపకరణమైన గతం నుంచి నేడు ప్రతి ఇంట్లో స్మార్ట్ టివి మోగుతోంది. ట్రంక్‌కాల్ వసతి నుంచి ప్రతి చేతిలో స్మార్ట్ ఫోన్ కూర్చొంది. మానవ రహిత ఆఫీసు నడిపించే మర మనిషి రోబో రూపంలో నిలబడ్డాడు. క్షణాల్లో సమాచార వితరణకు సామాజిక మాధ్యమ వేదికలు అందుబాటులోకి వచ్చాయి. దూరాలు చేరిపేస్తున్న వీడియో కాల్ వసతి మన సొంతమైంది. గాల్లో ఎగిరే విమానాన్ని చూసి కేరింతలు కొడుతూ అపూర్వ అనుభవంగా మనసుల్లో దాచుకున్న రోజుల నుంచి సామాన్యుడు విమానయానం చేసే స్థాయి ఏర్పడింది. అరచేతిలో స్మార్ట్‌ఫోన్ రూపంలో వైకుంఠం వెలసింది. శాస్త్రసాంకేతిక విప్లవంతో ప్రపంచమే కుగ్రామం అయ్యింది. అంతరిక్షయానం ఆటగా మారింది. గ్రహాలకు యాత్రలు, ఉపగ్రహాలపై మానవ నివాసాలు సుసాధ్యమయ్యే రోజులు చూస్తున్నాం. ఉత్తరాలు వ్రాయడం మానేసి, ఈ-మేయిల్స్ పంపిస్తున్నాం. మానవాళి జీవనశైలిని సమూలంగా మార్చి వేసిన నవ్య ఉపకరణాల్లో స్మార్ట్ ఫోన్స్, స్మార్ట్ టివీలు, ల్యాబ్ ట్యాబ్స్, పిసిలు, కంప్యూటర్స్, సామాజిక మాధ్యమాలు, రోబోటిక్స్, క్లౌడ్-ఆధారిత వ్యవస్థలు, కృత్రిమ మేధ లాంటి నవ్య సాంకేతిక ఫలాలు మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. సామాజిక ఆర్థిక ప్రగతి, ఉత్పత్తుల పెరుగుదల, కనెక్టివిటీ ఊహకందనంత పెరిగి పోయింది. నేటి డిజిటల్ విప్లవం అత్యంత వేగంగా, తీవ్రంగా విస్తరిస్తోంది. గత కొన్ని దశాబ్దాల్లో పిసిల స్టోరేజ్ కెపాసిటీ, ఉపకరణ సైజ్‌ల్లో అనేక రేట్ల మార్పులు చూస్తున్నాం. మూడు దశాబ్దాల క్రితం గ్లోబల్ ఐపి ట్రాఫిక్ రోజుకు 100 జిబి ఉండగా, నేడు సెకనుకు 1.5 లక్షల జిబిలకు చేరడం జరిగింది. కోవిడ్-19 సంక్షోభ అనంతరం డిజిటలైజేషన్ వేదికగా పరిశ్రమలు, వ్యక్తులు, విద్యార్థులు, ఉద్యోగస్థులు, వాణిజ్యాల ప్రాధాన్యతలు మనం అనుభవిస్తున్నాం.

ఖనిజ వనరుల దోపిడి :

డిజిటల్ ఉపకరణాల ఉత్పత్తికి సంబంధించిన కాలుష్యాన్ని డిజిటల్ పొల్యూషన్‌గా పిలుస్తారు. డిజిటల్ విప్లవం వేదికపైన కనిపిస్తున్న వెలుగులను చూస్తున్న మానవాళి తెర వెనుక దాగి ఉన్న దుష్ప్రభావాలు రాబోయే తరాలకు శాపాలుగా మారనున్నాయని మరిచి పోతున్నాం. వ్యక్తులు, సంస్థలు, సామాజిక వ్యవస్థలు పలు వికృత రూపాలను చూడనున్నాయి. డిజిటల్ పరిశ్రమతో అస్థిరాభివృద్ధి, పర్యావరణ విచ్ఛిన్నత పెనవేసుకున్నాయి. డిజిటల్ టెక్నాలజీ ఉపకరణాల తయారీలో అరుదైన ఖనిజ లోహాలు, ఖరీదైన కోబాల్ట్ లాంటి లోహాలు విచ్చలవిడిగా వాడడుతున్నాం. ఈ క్రమంలో పర్యావరణానికి హాని చేయగల హెవీ మెటల్స్, రేడియోధార్మిక పదార్థాలను విసర్జించడంతో భవిష్యత్తు ఎంతో ప్రమాదకర అనుభవాలను రుచి చూడనున్నాం. డిజిటన్ మౌళిక సదుపాయాల కల్పనకు అపార శక్తి వినియోగం, కార్బన్ ఉద్గారాలు పెరగడం, భూతాపం లాంటి ప్రతికూలతలు దాగి ఉన్నాయి. ప్రపంచంలోని 3 శాతం విద్యుత్తును వినియోగిస్తూనే, 2 శాతం గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలను చేస్తున్నాం. కృత్రిమ మేధ సృష్టి వెనుక దాదాపు 300 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల జరుగుతోంది. బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీ టెక్నాలజీ ఎంతో విద్యుత్తును వినియోగిస్తున్నాయి. పారిశ్రామిక వ్యర్థాల దుష్ప్రభావాల కన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల కాలుష్యం దీర్ఘకాలికంగా ప్రమాదకరమవుతున్నది.

ఈ-వ్యర్థాలు (ఎలక్ట్రానిక్ వేస్ట్):

2015 గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 710 మిలియన్ల డిజిటల్ ఉపకరణాలు ఉన్నాయని అంచనా. ఇంటర్నెట్ విస్తార వినియోగంతో నేడు 4 శాతం ఉన్న ఉద్గారాలు 2040 నాటికి 14 శాతం గ్లోబల్ ఎమిషన్స్ జరుగవచ్చు. డిజిటలైజేషన్ పుణ్యాన ప్రమాదకరమైందిగా ఈ-వ్యర్థాలు (ఎలక్ట్రానిక్ వేస్ట్) నిలుస్తున్నది. టివీలు, స్మార్ట్ ఫోన్‌లు, కంప్యూటర్ ఉపకరణాలు, స్మార్ట్ వాచ్‌లు లాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాల ఉత్పత్తుల్లో ముఖ్యమైన లోహాలు, విద్యుత్తు వినియోగం ఇమిడి ఉంటుంది. వీటిలో 80 శాతం ఈ-వ్యర్థాలు, 20 శాతం విద్యుత్ వినియోగ కాలుష్యం జనిస్తాయి. కంప్యూటరైజేషన్ పరిశ్రమ దుష్ప్రభావాలుగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణ విచ్ఛిన్నాలుగా మారుతున్నాయి. ప్రపంచ ఘన వ్యర్థాల్లో 2 శాతం ఈ-వ్యార్థాలను, 70 శాతం విష వ్యర్థాలను విడుదల చేస్తున్నాయి. ఐరాస అంచనా ప్రకారం 50 మిలియన్ టన్నుల ఈ-వ్యర్థాలు విడుదల అవుతున్నాయని తెలుస్తున్నది. వీటిలో గరిష్టంగా 20 శాతం మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నది. డిజిటల్ విప్లవంతో పరోక్షంగా వినియోగదారులకు కలుగుతున్న అనారోగ్యాలు వెలకట్టలేనివి. నిరంతరం నీలి తెరలను అతుక్కున ఉంటున్న యువత కంటి జబ్బులు, మానసిక ఒత్తిడి, వ్యసనం, ఒంటరితనం, ఉద్రేకం లాంటి లక్షణాలను ప్రదర్శిస్తున్నారు. నవ్యత వైపుకు డిజిటల్ అడుగులు పడుతున్న వేళ సుస్థిరాభివృద్ధి దిశగా, గ్రీన్ వ్యవస్థల స్థాపనలు, కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ప్రపంచ దేశాలు ప్రయాసపడని యెడల డిజిటల్ విప్లవం కాలుష్య విస్తరణ కేంద్రంగా మారుతుందని గమనిస్తూ, సుస్థిరత వైపుకు పటిష్ట అడుగులు వేద్దాం. స్మార్ట్ డిజిటల్ ఆలోచనలతో స్వచ్ఛతకు పట్టం కడదాం.

## అఖిల భారత ఆయుర్వేద సంస్థలో న్యూట్రి గార్డెన్‌ను ప్రారంభించిన కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:నెలరోజులపాటు సాగే పోషణ్ మాహ్ 2021లో భాగంగా కేంద్ర మహిళా , శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి జుబిన్ ఇరాని పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె, దేశ పౌష్టికాహార అవసరాలను తీర్చేందుకు ప్రాచీన ఆయుర్వేద విజ్ఞానాన్ని ఎంత మెరుగుగా ఉపయోగించుకోవచ్చునన్నదానిని తెలియజెప్పడమే ప్రస్తుత అవసరమని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి జుబిన్ ఇరాని అన్నారు. 2021 పోషణ్ మాహ్‌ను ఈరోజు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఎఐఐఎ) వద్ద ప్రారంభిస్తూ ఆమె న్యూట్రి గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ సహాయమంత్రి డాక్టర్ ముంజపర మహేంద్ర భాయ్ , మహిళా శిశు అభివృద్ధి శాఖ సహాయమంత్రి కూడా పాల్గొన్నారు. మునగ, ఉసిరి మొక్కలను కూడా ఇరువురు మంత్రులు నాటారు. న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఎఐఐఎ) ఆయుష్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు పోషణ్ మాహ్ 2021 ఉత్సవాలను ప్రారంభించింది.

దేశంలో రక్తహీనత కేసులను తగ్గించేందుకు ఐసిఎంఆర్ సమష్టి సహకారంతో ఆయుష్ మంత్రిత్వశాఖ కృషిని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తమ ప్రసంగంలో ప్రశంసించారు. ఆయుర్వేదకు సంబంధించిన శాస్త్రీయ సమాచారాన్ని ప్రచురించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దీనివల్ల ఆయుర్వేద రంగం కృషిని ప్రపంచం గుర్తించడానికి వీలుంటుందని అన్నారు. పౌష్టికాహారానికి సంబంధించి రెండు ముఖ్యమైన అంశాలు ఉన్నాయని అంటూ ఆమె, అందులో ఒకటి అందుబాటు ధరలో ఉండడం అయితే , మరొకటి వెంటనే అందుబాటులో ఉండడం అని అన్నారు. ఈవిషయంలో ఆయుర్వేదం ఎంతో ప్రయోజనకరమని ఆమె అన్నారు. ఆరోగ్యకరమైన సంతానానికి ఆయుష్ రూపొందించిన కాలెండర్‌ను , ప్రాచీన వంటకాలను మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ద్వారా బహుళ ప్రచారంలోకి తీసుకువస్తున్నట్టు ఆమె తెలిపారు.

ఆయుర్వేద వనమూలికలైన షిగురు, శతావరి, అశ్వగంధ,ఆమ్లా, తులసి , హల్ది వంటి వాటి లోని పోషక విలువలను డాక్టర్ ముంజ పర మహేంద్ర భాయి ప్రధానంగా ప్రస్తావించారు. అలాగే తల్లీ , పిల్లల ఆరోగ్యానికి సంబంధించి తగిన ఆధారాలు కలిగిన ఆయుర్వేదకు చెందిన పోషకాహార అలవాట్లను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత గురించి ఆయన ప్రముఖంగా తెలిపారు. గర్భిణులు ఆరోగ్యకరంగా ఉండేందుకు పోషకాహారం ఎంతటి ప్రాధాన్యత కలిగిఉంటుందో ఆయన తెలియజేశారు. ఇందులో ఆయుర్వేద ఉపయోగంగురించి వివరించారు.

మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ ఇందీవర్ పాండే, ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటెచ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల రోజులపాటు సాగే పౌష్టికాహార మాసోత్సవంలో పేషెంట్లకు అవగాహన కల్పించే ఉపన్యాసాలు,క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు, అతిథి ప్రసంగాలు, వర్క్‌షాపులను ఎఐఐఎ నిర్వహించనుంది.

ఆరోగ్యానికి సంబంధించిన, పోషక విలువలు కలిగిన మొక్కలను పేషెంట్లకు, ఆరోగ్య కార్యకర్తలకు పంచే కార్యక్రమాన్నిచేపట్టారు. శతావరి, అశ్వగంధ, ముస్లి, యష్టిమధు వంటి మొక్కలను పంపిణీ చేశారు. పోషక విలువలు కలిగిన ఎంపిక చేసిన మొక్కలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు పంపిణీ చేశారు. ప్రాచీన ఆయుర్వేద వంటకాలు అలాగే వివిధ పానీయాలైన సత్తు పానీయం, నువ్వు ఉండలు, ఊదల ఖీరా, ఒడిసల విత్తనాలతో లడ్డు, ఉసిరి పానక తదితరాలను ఈ కార్యక్రమం సందర్భంగా ప్రదర్శించారు.

## నూతన విద్యా విధానం 2020తో విద్యా రంగంలో ప్రపంచ అగ్రగామి దేశంగా భారత్ మారుతుంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:నూతన విద్యా విధానం 2020 తో విద్యా రంగంలో ప్రపంచ అగ్రగామి దేశంగా భారత్ మారుతుందని కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. విద్యా విధానంలో తీసుకుని వచ్చిన మార్పుల వల్ల భారతదేశం విద్యా రంగంలో ప్రపంచ జ్ఞాన సూపర్ పవర్‌గా నిలుస్తుందని ఆయన అన్నారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఎన్‌సిఇఆర్‌టి61 వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ సుభాష్ సర్కార్, విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ రాజ్ కుమార్ రంజన్ సింగ్ , మంత్రిత్వ శాఖ ,ఎన్‌సిఇఆర్‌టి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

విద్య నాణ్యతను మెరుగుపరచడంలో ఎన్‌సిఇఆర్‌టి కృషిని శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసించారు. ఎన్‌సిఇఆర్‌టి సాధించిన ప్రగతిని గుర్తు చేసిన మంత్రి కోవిడ్ సమయంలో పాఠశాల విద్యా అంశాల్లో సంస్థ అమలు చేసిన కార్యక్రమాలు ప్రజలకు ప్రయోజనం కలిగించాయని చెప్పారు. విద్యార్థులు నష్టపోకుండా చూడడానికి ఎన్‌సిఇఆర్‌టి ప్రత్యామ్నాయ విద్యా సంవత్సరానికి రూపకల్పన చేసిందని చెప్పారు. ప్రభుత్వం తీసుకుని వచ్చిన నూతన విద్యా విధానాన్ని అమలు చేసి విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకుని రావడానికి ఎన్‌సిఇఆర్‌టి తగిన చర్యలను అమలు చేయాలని మంత్రి సూచించారు.

ఎన్‌సిఇఆర్‌టి కి అభినందనలు తెలిపిన విద్యా శాఖ సహాయ మంత్రి శ్రీ సుభాష్ సర్కార్ మూడు హంసల గుర్తు ప్రాముఖ్యతను వివరించి 'విద్య ద్వారా శాశ్వతమైన జీవితం' అనే అంశానికి సంస్థ ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. పరిశోధన, అభివృద్ధి, శిక్షణా రంగాలలో ఎన్‌సిఇఆర్‌టి సాధించిన ప్రగతికి శిక్షణ పొందిన 42 లక్షల మంది ఉపాధ్యాయులు నిదర్శనమని అన్నారు.

ఆత్మ నిర్బర్ భారత్, నైపుణ్య భారత్ నిర్మాణంలో విద్యను వృత్తి విద్యతో అనుసంధానం చేసి అందించే విద్య కీలకంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నూతన విద్యా విధానంతో నవ భారత నిర్మాణం సాధ్యమవుతుందన్న ప్రధానమంత్రి వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. ఈ అంశంలో ఎన్‌సిఇఆర్‌టి గురుతర బాధ్యతను నిర్వర్తించవలసి ఉంటుందని అన్నారు.

డాక్టర్ రాజ్‌కుమార్ రంజన్ సింగ్ మాట్లాడుతూ స్థాపక దినోత్సవం సందర్భంగా గతంలో సాధించిన ప్రగతిని ఆత్మపరిశీలన చేసుకొని భవిష్యత్తు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఎన్‌సిఇఆర్‌టి విద్యా రంగంలో మార్పులను అమలు చేస్తున్నదని అన్నారు. కొత్త పాఠ్యాంశాల ద్వారా అభ్యాసకులు ప్రయోజనం పొంది స్వస్త్ భారత్ నిర్మాణంలో తమ వంతు యాత్ర పోషించాలని సూచించారు.

ఆరు దశాబ్దాల కాలంలో సంస్థ సాధించిన విజయాలను ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ( ఇంచార్జి) వివరించారు. జాతీయ సంస్థగా కౌన్సిల్ పాఠశాల విద్యలో శ్రేష్ఠత, సమానత్వం , సమగ్రత మరియు నాణ్యతను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందని అన్నారు. పరిశోధన, పాఠ్యాంశాల అభివృద్ధి, సిలబస్, పాఠ్యాంశాలు, శిక్షణాకార్యక్రమాలను ప్రత్యక్షంగా మరియు ఆన్‌లైన్ మోడ్‌లలో ఎన్‌సిఇఆర్‌టి నిర్వహిస్తోంది. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ద్వారా విద్యార్థుల ప్రతిభను సంస్థ అంచనా వేసింది. అభ్యాస ఫలితాల అభివృద్ధి, పాఠశాల విద్య అన్ని దశల కోసం అన్ని పాఠ్యాంశాలలో ఇ-కంటెంట్‌లను సిద్ధం చేసింది.

ఎన్‌సిఇఆర్‌టి అధికారిక యూట్యూబ్ ద్వారా అన్ని విభాగాల అధ్యాపకులు, సిబ్బంది మరియు ఇతర ఆహ్వానితులందరూ ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. కార్యక్రమం కోవిడ్ అనుగుణ నిబంధనలతో నిర్వహించబడింది.

## శ్రీల భక్తివేదాంత స్వామి ప్రభుపాదగారి 125వ జయంతి సందర్భంలో ఒక ప్రత్యేకమైన స్మారక నాణేన్ని విడుదల చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:శ్రీల భక్తివేదాంత స్వామి ప్రభుపాద గారి 125వ జయంతి సందర్భం లో ఒక ప్రత్యేకమైన స్మారక నాణేన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ఆవిష్కరించారు. ఈ సందర్భం లో సంస్కృతి, పర్యటన, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ (డిఒఎన్ఇఆర్) కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి తదితరులు పాలుపంచుకొన్నారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రోతల ను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఒక రోజు ముందే జన్మాష్టమి రావడం, ఇప్పుడు శ్రీల ప్రభుపాద గారి 125 వ జయంతి కావడం సంతోషదాయకం అయినటువంటి యాదృచ్ఛిక ఘటన అని ప్రస్తావించారు. "ఇది సాధన ద్వారా సంతోషాన్ని, సంతృప్తి ని ఏక బిగి న సాధించుకోవడం లాగా ఉంది. అంతేకాదు, ఈ సందర్భం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' సంబరాల మధ్య చోటు చేసుకొంటోంది అని ఆయన గుర్తు కు తెచ్చారు. శ్రీల ప్రభుపాద స్వామి గారి కి చెందిన లక్షల కొద్దీ అనుయాయులు, ప్రపంచం అంతటా విస్తరించిన లక్షల కొద్దీ కృష్ణ భక్తులు ఈ రోజు న ఇటువంటి అనుభూతి నే పొందుతూ ఉన్నారు" అని ప్రధాన మంత్రి అన్నారు.

కృష్ణ భగవానుడు అంటే ప్రభుపాద స్వామి గారి కి ఉన్నటువంటి మహనీయ భక్తి ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ప్రభుపాద స్వామి గారు భారత్ కు కూడా ఒక గొప్ప భక్తుడు అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటం లో ప్రభుపాద స్వామి గారు కూడా సంఘర్షణ చేశారు అని ప్రధాన మంత్రి వివరించారు. సహాయ నిరాకరణ ఉద్యమాని కి సమర్థన గా ప్రభుపాద స్వామి గారు స్కాట్‌లాండ్ కు చెందిన ఒక కళాశాల నుంచి డిప్లొమా ను స్వీకరించడానికి తిరస్కరించారు అని ప్రధాన మంత్రి అన్నారు.

యోగ ను గురించిన మన జ్ఞానం ప్రపంచం అంతటా విస్తరించింది, అదే మాదిరి గా భారతదేశం అనుసరించిన నిలకడతనం తో కూడిన జీవన శైలి, ఆయుర్వేద వంటి విజ్ఞాన శాస్త్రం కూడా ప్రపంచం అంతటా వ్యాప్తి చెందాయి అని ప్రధాన మంత్రి అన్నారు. వీటి ద్వారా యావత్తు ప్రపంచం ప్రయోజనాల ను పొందాలి అనేదే మన సంకల్పం గా ఉంది అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. మనం మరే దేశానికైనా వెళ్ళి అక్కడి ప్రజల ను కలుసుకొన్నపుడల్లా వారు 'హరే కృష్ణ' అంటూ మనను పలకరిస్తున్నారని, దీని ద్వారా మనం మరింత ఆత్మీయ భావన ను పొందుతూ గర్వపడుతున్నాం అని ప్రధాన మంత్రి అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులు అదే విధమైన ఆప్యాయత ను అందుకొన్నప్పుడు కూడా ఇదే విధమైన భావన ఏర్పడుతుంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ విషయం లో ఐఎస్‌కెసిఒఎన్ ('ఇస్కాన్') నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చు అని ఆయన అన్నారు.

బానిసత్వం కాలం లో భక్తి అనేది భారతదేశం తాలూకు స్ఫూర్తి ని సజీవం గా ఉంచింది అని ప్రధాన మంత్రి అన్నారు. భక్తి యుగం తాలూకు సామాజిక క్రాంతి అంటూ ఏదీ లేకపోతే గనక భారతదేశం తాలూకు హోదా ను, భారతదేశం తాలూకు స్వరూపాన్ని ఊహించడానికి కష్టమైపోయేది అని నేటి పండితులు అభిప్రాయపడుతున్నారు అని ప్రధాన మంత్రి అన్నారు. భక్తి అనేది విశ్వాసం, సామాజిక అంతస్తులు, విశేష అధికారాలు అనే వివక్ష ను తొలగించి, ప్రాణి ని దైవం తో జత పరచింది అని ఆయన అన్నారు. అటువంటి కష్ట కాలాల లో సైతం చైతన్య మహా ప్రభు గారు వంటి సాధువులు సంఘాన్ని భక్తి తాలూకు స్ఫూర్తి తో ముడి పెట్టి 'ధర్మం నుంచి (ఆత్మ)విశ్వాసం' అనే మంత్రాన్ని అందించారు అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

ఒక కాలం లో వేదాంతాన్ని పశ్చిమ దేశాల చెంతకు తీసుకుపోవడం కోసం స్వామి వివేకానందుల వారు వంటి ఒక ముని రాగా, భక్తి యోగ ను ప్రపంచానికి అందించేటటువంటి ఒక బృహత్తర బాధ్యత ను శ్రీల ప్రభుపాద గారు మరియు ఇస్కాన్ తీసుకున్నట్లు ప్రధాన మంత్రి పేర్కొన్నారు. భక్తి వేదాంతాన్ని ప్రపంచం తాలూకు చైతన్యం తో శ్రీల ప్రభుపాద గారు పెనవేశారు అని ప్రధాన మంత్రి చెప్పారు.

ప్రస్తుతం ప్రపంచం లో వివిధ దేశాల లో ఇస్కాన్ ఆలయాలు వందల సంఖ్య లో ఉన్నాయని, మరి అనేక గురుకులాలు భారతీయ సంస్కృతి ని నిలబెడుతున్నాయని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశాని కి ధర్మం అంటే ఉత్సాహం, ఉద్వేగం, ఉల్లాసం లతో పాటు మానవ జాతి పట్ల నమ్మకం కూడాను అని ప్రపంచాని కి ఇస్కాన్ బోధించింది అని ప్రధాన మంత్రి వివరించారు. కచ్ఛ్ లో భూకంపం సంభవించినప్పుడు, ఉత్తరాఖండ్ దుర్ఘటన వేళ, అలాగే ఒడిశా లో, బంగాల్ లో తుఫాను లు విరుచుకుపడినప్పుడు ఇస్కాన్ అందించిన సేవల ను గురించి శ్రీ నరేంద్ర మోదీ ప్రముఖం గా ప్రకటించారు. మహమ్మారి కాలం లో ఇస్కాన్ కృషి ని కూడా ప్రధాన మంత్రి ప్రశంసించారు.

## 'వై-బ్రేక్' యోగా విధాన అనువర్తనాన్ని నలుగురు కేంద్ర మంత్రులతో కలసి ప్రారంభించిన సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వ విధానాన్ని ప్రతిబింబిస్తూ, బుధవారం విజ్ఞాన్ భవన్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ మరో నలుగురు మంత్రిమండలి సహచరులతో కలసి 'వై-బ్రేక్' అనువర్తనాన్ని ప్రారంభించారు. కాగా, ఈ అనువర్తనం రూపకల్పనలో ఆయుష్ మంత్రిత్వశాఖ కృషిని ప్రశంసిస్తూ ఇది "దావానలంలా వ్యాప్తి చెందుతుంది" అని మంత్రులలో ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. ముఖ్యంగా వృత్తి నిపుణులను దృష్టిలో పెట్టుకుని కొన్ని 'ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం'తో కూడిన ఐదు నిమిషాల విధానంతో ఈ అనువర్తనం రూపొందించబడింది. ఈ స్వల్పవ్యవధి కసరత్తుతో పని ప్రదేశాల్లో ఒత్తిడి తొలగి, ప్రశాంతత చేకూరడంవల్ల వారు తిరిగి తమ విధుల్లో నిమగ్నమై, తమ ఉత్పాదకను పెంచుకోగలుగుతారు.

ఈ సందర్భంగా శ్రీ సర్బానంద సోనోవాల్ యోగావల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ- "కార్పొరేట్ రంగంలో వృత్తి నిపుణులు తరచూ వృత్తిగతంగా ఒత్తిడికి లోనవడమేగాక శారీరకంగానూ సమస్యలు ఎదుర్కొంటారన్నది మనకు తెలిసిందే. ఇటువంటి సమస్యలు ఇతర వృత్తుల్లో ఉంటాయన్నది కూడా వాస్తవమే... ఈ నేపథ్యంలో పని ప్రదేశాల్లో ఉన్నవారిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులకు ఉపశమనం కల్పించే విధంగా 'వై-బ్రేక్' రూపొందించబడింది. ఈ 'వై-బ్రేక్' అనువర్తనాన్ని చిత్తశుద్ధితో వినియోగిస్తే ప్రజల ఆరోగ్య నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించగలదనడంలో సందేహం లేదు" అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర చట్టం-న్యాయ శాఖ మంత్రి శ్రీ కిరణ్ రిజిజు; శాస్త్ర-సాంకేతిక-భూవిజ్ఞాన శాఖ సహాయ (ఇన్‌చార్జి)మంత్రి డాక్టర్ శ్రీ జితేంద్ర సింగ్; విదేశీ వ్యవహారాలు-సాంస్కృతిక శాఖ సహాయమంత్రి శ్రీమతి మీనాక్షి లేఖి; ఆయుష్-మహిళా/శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ ముంజపర మహేంద్రభాయ్ కలుభాయ్ కూడా పాల్గొన్నారు.

యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపుపై శ్రీ సోనోవాల్ మాట్లాడుతూ- "యోగా నేడు అంతర్జాతీయంగా విశేష ప్రాచుర్యం పొందింది. భూగోళంలో దాదాపు ప్రతిచోటకూ ఇది విస్తరించింది. ప్రపంచ ప్రజానీకం ఏదో ఒక రూపంలో యోగాను ఆచరిస్తున్నారు. ఇది ఆధ్యాత్మికంగానే కాకుండా ఆరోగ్యరీత్యా కూడా ఎంతో ప్రయోజనకరం. ప్రాచీన భారతంలో యోగాభ్యాసం భావన అటు వైద్యం/ఆరోగ్యం లేదా విద్య/కళలు తదితర రంగాలకు సంబంధించి భారతీయ సమాజంలోని వివిధ అంశాలను ఎంతగానో ప్రభావితం చేసింది" అని పేర్కొన్నారు.

డాక్టర్ ముంజపర మహేంద్రభాయ్ ప్రసంగిస్తూ- "యోగా బ్రేకప్ అనువర్తనం ఎంత ప్రభావశీలమైనదో మీరంతా స్వయంగా చూశారు. దీన్ని రూపొందించడంలో ఎంత లోతైన పరిశోధన, అనుభవజ్ఞుల ఆలోచనలు ఇమిడి ఉన్నాయో కూడా మీరు గమనించారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రయోగాలు, పరీక్షలు నిర్వహించబడ్డాయి. అలాగే మన శరీరంలోని వివిధ కోశాలపై దీని ప్రభావం గురించి కూడా లోతుగా చర్చించబడింది" అని తెలిపారు. ఆయన తన ప్రసంగం కొనసాగిస్తూ- "విభిన్న యోగా పద్ధతుల గురించి ఈ 'వై-బ్రేక్' అనువర్తనం అవగాహన కల్పించడంతోపాటు ఏ సమయంలోనైనా సులువుగా యోగాభ్యాసం చేసేందుకు తోడ్పడుతుంది" అన్నారు.

శ్రీమతి మీనాక్షి లేఖి మాట్లాడుతూ- "మానవాళి సుస్థిర జీవనస్థాయిని సాధించడంలో ఈ 'వై-బ్రేక్' అనువర్తనం గణనీయంగా దోహదపడుతుంది" అన్నారు. మన జీవితాల్లో ఒత్తిడిని తగ్గించడంలో తన పాత్ర ఎంత ముఖ్యమైనదో 'వై-బ్రేక్' కచ్చితంగా రుజువు చేసుకుంటుందని ఆమె చెప్పారు.

శాస్త్ర-సాంకేతిక-భూవిజ్ఞాన శాఖ సహాయ (ఇన్‌చార్జి)మంత్రి డాక్టర్ శ్రీ జితేంద్ర సింగ్ ప్రసంగిస్తూ- "యోగాకు ప్రాచుర్యం కల్పించడంలో మనం డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ఎంతైనా హర్షణీయం. పని ప్రదేశాల్లో ప్రతి ఒక్కరి సద్వినియోగం దిశగా ఐదు నిమిషాలపాటు యోగాభ్యాసం చేసేందుకు వీలు కల్పిస్తూ చట్టం చేయాలని ఈ సందర్భంగా నేను కేంద్ర న్యాయశాఖ మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను" అన్నారు.

కేంద్ర చట్టం-న్యాయశాఖ మంత్రి శ్రీ కిరణ్ రిజిజు మాట్లాడుతూ- "ఆయుష్ మంత్రిత్వశాఖ యోగాను ఎంతో సరళమైన మార్గాల్లో ప్రజల్లోకి తీసుకెళ్తుండటం ప్రశంసనీయం. ఈ మేరకు 'వై-బ్రేక్' అనువర్తనం కచ్చితంగా దావానలంలా వ్యాప్తి చెందుతుందని నేను విశ్వసిస్తున్నాను" అన్నారు.

భారత స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవాల నేపథ్యంలో చేపట్టిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాల్లో భాగంగా అనువర్తన ప్రారంభోత్సవం నిర్వహించబడింది. ఈ మేరకు 'వై-బ్రేక్'కు శ్రీకారం సహా వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం ఆయుష్ మంత్రిత్వశాఖకు ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 5 వరకూ వారం రోజుల సమయం ఇవ్వబడింది. తదనుగుణంగా ఆయుష్ విధానాలపై పాఠశాలల్లో అవగాహన శిబిరాలు, 'అశ్వగంధ'ను రోగనిరోధక ఔషధంగా పరిచయం చేయడం, రైతులతోపాటు ప్రజలకు ఔషధ మొక్కల పంపిణీ తదితర కార్యకలాపాలను చేపట్టారు.

ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రులుసహా ఆహూతులందరూ లయబద్ధంగా, ఆకట్టుకునే రీతిలో యోగాసనాలు వేయడం విశేషం. ఈ మేరకు మొబైల్ అనువర్తనంలో సూచించిన ఐదు నిమిషాల యోగా పద్ధతులను వారుందరూ ప్రదర్శించారు. ప్రభుత్వంలోని వివిధ విభాగాల సీనియర్ అధికారులుసహా స్వయంప్రతిపత్తి సంస్థల ప్రతినిధులు, 'అసోచామ్, సీఐఐ, ఫిక్కి' వంటి పారిశ్రామిక సంఘాల సభ్యులు తదితర ప్రముఖులు అనేకమంది దృశ్యమాధ్యమం ద్వారా ఇందులో పాలుపంచుకున్నారు. అలాగే యోగా-నేచురోపతి సంస్థలు, విదేశాల్లోని విశ్వవిద్యాలయాలు-యోగా కేంద్రాలు, యోగాభ్యాసకులు, మేధావులు, విధాన రూపకర్తలు, అధికారులు, ఔత్సాహిక యోగాభ్యాసకులు, నిపుణులు, వివిధ అనుబంధ శాస్త్రాల నిపుణులు కూడా ఇందులో భాగస్వాములయ్యారు.

పవిత్ర జ్యోతిని వెలిగించి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో 'వై-బ్రేక్' అనువర్తనానికి సంబంధించి ఆయుష్ మంత్రిత్వశాఖ ప్రత్యేకాధికారి (ఆయుష్ గ్రిడ్) డాక్టర్ లీనా ఛాత్రే సాంకేతిక ప్రదర్శన ఇచ్చారు. అలాగే మొరార్జీ దేశాయ్ నేషనల్ యోగా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర్ వి.బసవారెడ్డి యోగాసనాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. 'వై-బ్రేక్' అనువర్తనంలో కింద సూచించిన కొన్ని సాధారణ యోగాసన పద్ధతులున్నాయి:

ఈ ఆసనాలతో కూడిన విధానాన్ని 2020 జనవరిలో వివిధ భాగస్వాముల సహకారంతో ప్రయోగాత్మకంగా ఆరు మహానగరాల్లో ప్రారంభించారు. తదనుగుణంగా దేశంలోని ఆరు ప్రముఖ యోగా సంస్థలతో సంయుక్తంగా మొరార్జీ దేశాయ్ నేషనల్ యోగా ఇన్‌స్టిట్యూట్ 15 రోజులపాటు పరీక్షాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి 717 మంది పాల్గొన్న ఈ ప్రయోగాత్మక కార్యక్రమం పూర్తిగా విజయవంతమైంది. దీనికి సంబంధించి ఎంతో ప్రోత్సాహకరమైన విశ్లేషణ లభించింది. ఈ 'వై-బ్రేక్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా, ప్రత్యేక కార్యదర్శి శ్రీ ప్రమోద్ కుమార్ పాఠక్, సంయుక్త కార్యదర్శి శ్రీ డి. సెంథిల్ పాండియన్; ఈ శాఖ పరిధిలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ యోగా ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఈశ్వర్ వి.బసవారెడ్డి, ఆయుష్ డైరెక్టర్ శ్రీ విక్రమ్ సింగ్ తదితర, ఇతర మంత్రిత్వశాఖల సీనియర్ అధికారులుసహా ఆయుష్ పరిధిలోని జాతీయ సంస్థలు, పరిశోధక మండళ్ల అధికారులు, అనేకమంది ప్రముఖులు, నిపుణులు కూడా పాల్గొన్నారు.

## కర్ణాటక, తమిళనాడులలో కోవిడ్ -19 పరిస్థితులపై సమీక్ష నిర్వహించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయ ఈరోజు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ఆరోగ్యశాఖ మంత్రులతో ఈ రాష్ట్రాలలోని కోవిడ్ -19 పరిస్థితులపై మాట్లాడారు. కేరళలో కేసులు పెరుగుతుండడంతో కేరళతో సరిహద్దు కలిగిన కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో కోవిడ్ -19ను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ఆరోగ్యమంత్రి వీరితో చర్చించారు.

కోవిడ్ -19 మహమ్మారి అంతర్ రాష్ట్రీయంగా వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవలసిన అవసరాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ శ్రీ మన్‌సుఖ్ మాండవీయ, కేరళతో సరిహద్దు కలిగిన కర్ణాటక, తమిళనాడులలోని సరిహద్దు జిల్లాలలో వాక్సినేషన్ కార్యక్రమ వేగాన్ని మరింత పెంచాల్సిందిగా ఆయా రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులకు సూచించారు.

భారత ప్రభుత్వం కోవిడ్-19 మహమ్మారిపై పోరాటంలో ముందువరుసలో ఉంది. కోవిడ్ మహమ్మారిపై పోరాటానికి ఎంచుకున్న ఐది అంశాల వ్యూహంలో ( టెస్ట్, ట్రాక్, ట్రీట్, కోవిడ్ నియంత్రణకు అనుగుణమైన ప్రవర్తనతోపాటు) వాక్సినేషన్ కూడా ఒక ముఖ్యమైనదిగా ఉంది. 2021 జనవరి 16 వ తేదీ నుంచి ఇండియా కోవిడ్ -19 నిరోధానికి పెద్ద ఎత్తున వాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టి నిర్వహిస్తున్నది.

## సినీవాణిజ్య వృద్ధికి, సహకారానికి చక్కని మార్గం బ్రిక్స్ సమ్మేళనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: భారతదేశం ఆసియాలో కీలకమైన దేశమని, బ్రిక్స్ (బి.ఆర్.ఐ.సి.ఎస్.) కన్సార్షియం సభ్యదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో ప్రధాన పాత్ర పోషించాలన్నది తమ భావన అని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ చెప్పారు. 2021, సెప్టెంబరు ఒకటవ తేదీన 'బ్రిక్స్ ఫిల్మ్ టెక్నాలజీ చర్చాగోష్టి'లో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ,.. బ్రిక్స్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఫిల్మ్ టెక్నాలజీ చర్చాగోష్టిని నిర్వహించడం, సభ్యదేశాలన్నింటినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చేందుకు జరిగిన ప్రయత్నమని అన్నారు. "చలన చిత్రాలు, కళలు, సంస్కృతి తదితర మాధ్యమాల ద్వారా సహకారాన్ని పెంపొందించుకునేందుకు మనకు పలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. చలన చిత్ర వాణిజ్యంలో ప్రగతికి, వృద్ధికి ఇవి దోహదపడతాయి." అని ఆయన అన్నారు. ప్రధాన ఆర్థిక శక్తులుగా ఆవిర్భవిస్తున్న బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమి ఆధ్వర్యంలో,.. భారతీయ వాణిజ్య, పారిశ్రామిక మండలుల సమాఖ్య (ఫిక్కీ-ఎఫ్.ఐ.సి.సి.ఐ.), భారతీయ చలనచిత్ర, టెలివిజన్ సంస్థ (ఎఫ్.టి.ఐ.ఐ.),..కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతో కలసి ఉమ్మడిగా ఈ చర్చాగోష్టి నిర్వహించాయి. "భారతదేశంలో నిర్వహించే బ్రిక్స్ శిఖరాగ్ర సమ్మేళనం సన్నాహాల్లో భాగంగా బ్రిక్స్ ఫిల్మ్ టెక్నాలజీ చర్చాగోష్టిని నిర్వహించడం గర్వకారణంగా భారత్ భావిస్తోంది." అని ఠాకూర్ అన్నారు.

భారత్ అధ్యక్షతలో బ్రిక్స్ సహకారాన్ని మరింత సుస్థిరం చేసి, సంస్థాగతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన అన్నారు. "బ్రిక్స్ దేశాల ప్రజలందరి హృదయాలను గెలుచుకోవడం చాలా ముఖ్యం. ఇందుకు చలనచిత్ర చర్చాగోష్టి ఒక అవకాశం. చలనచిత్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందరినీ ఒక్కటి చేయడానికి ఇది దోహదపడుతుంది. చలనచిత్ర సాంకేతిక పరిజ్ఞాన ప్రతిభా పాటవాలను గౌరవ మర్యాదలతో భారతదేశంలో సత్కరించాలన్న భావన గౌరవ ప్రధానమంత్రిదే. బ్రెజిల్.లో జరిగిన 11వ బ్రిక్స్ శిఖరాగ్ర సమ్మేళనంలో ప్రధాని ఈ ప్రతిపాదన తీసుకువచ్చారు." అని కేంద్రమంత్రి గుర్తు చేశారు. మన సాంకేతిక నిపుణుల సృజనాత్మకతను సద్వినియోగం చేసుకోవాలని, బ్రిక్స్ దేశాల పౌరులందరికీ జాతి నిర్మాణ స్ఫూర్తిని అలవర్చాలని ఆయన పిలుపునిచ్చారు.

"చలన చిత్ర పరిశ్రమ కోసం పనిచేస్తున్న సేవారంగం పాత్రను, సాంకేతిక నిపుణుల సేవలను గుర్తించడమే బ్రిక్స్ ఫిల్మ్ టెక్నాలజీ చర్చాగోష్టి ప్రధాన ధ్యేయం. బ్రిక్స్ కూటమిలో సభ్యదేశాల్లోని చలన చిత్ర సాంకేతిక పరిజ్ఞాన నిపుణులకు తగిన అవకాశాలను కల్పించడంలో ఈ చర్చాగోష్టి దోహదపడుతుంది. దీనితో ప్రపంచ సినీ రంగంపై కొత్త దృక్పథం, దార్శనికతతో అన్వేషణకు వీలుంటుంది." అని కేంద్రమంత్రి అన్నారు.కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర మాట్లాడుతూ,...ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విభిన్న సంస్కృతులను పరస్పరం గౌరవించుకునేందుకు ఈ చర్చాగోష్టి తగిన వేదికను కల్పిస్తుందన్నారు. చలన చిత్రాల తయారీని ప్రోత్సహించే వివిధ సాంకేతిక పరిజ్ఞాన సంస్థలకు ఒక సరైన వేదికను, తగిన భాగస్వామ్యాలను ఈ చర్చాగోష్టి కల్పిస్తుందన్నారు. పరస్పర అభిప్రాయాల మార్పిడి, సహకారం మెరుగుదల కోసం చలనచిత్ర సంస్థలను ఒక తాటిపై తెచ్చేందుకు దోహదపడుతుందన్నారు. "చలన చిత్ర పరిశ్రమలో వి.ఎఫ్.ఎక్స్ అనిమేషన్, కంప్యూటర్ జనరేటెడ్ ఇమేజెరీ, మీడియా అవుట్ సోర్సింగ్ వంటి అంశాలకు సంబంధించి బ్రిక్స్ కూటమి సభ్యదేశాలు ఎంతో గణనీయమైన కృషి చేస్తున్నాయి. చలన చిత్ర నిర్మాణం, ప్రపంచ వినోద పరిశ్రమలో సాంకేతిక పరిజ్ఞానం స్థాయిని పెంచే విషయంలో పరస్పర సహకారానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. భారతదేశంలో 52వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంతో పాటు బ్రిక్స్ చలన చిత్రోత్సవం కూడా జరగబోతోంది. మన ఉత్తమ చలన చిత్రాలను పంచుకునేందుకు ఈ రెండు కార్యక్రమాలూ చక్కని అవకాశం కల్పిస్తాయి." అని అపూర్వ చంద్ర అన్నారు. బ్రెజిల్ ఫెడరల్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ ప్రత్యేక కార్యదర్శి మేరియో ఫ్రియాస్ మాట్లాడుతూ, సాంస్కృతిక రంగంలో బ్రిక్స్ కూటమి సభ్యదేశాలు పరస్పరం సహాయం అందించుకుంటూ, సహకారాన్ని ప్రోత్సహించేందుకు మనం కృషిని కొనసాగించాల్సిందేనని అన్నారు. "సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థపై ఆంక్షలతో కూడిన చర్యల ప్రభావాన్ని తగ్గించేందుకు ఇది దోహదపడుతుంది. బ్రిక్స్ దేశాల మధ్య దృశ్య-శ్రవణ సహకారం మార్కెట్ అవకాశాల అన్వేషణకు, సాంస్కృతిక కార్యకలాపాల విస్తృతికి అవకాశం కల్పిస్తుంది." అని ఆయన అన్నారు.కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నీరజా శేఖర్ ఈ చర్చాగోష్టికి వందన సమర్పణ చేశారు. ఫిక్కీ ప్రధాన కార్యదర్శి దిలీప్ చంద్ర సమన్వయకర్తగా వ్యవహరించారు. రెండు రోజులపాటు జరిగే చర్చాగోష్టిని బ్రిక్స్ కూటమి సభ్యదేశాలకు చెందిన పలువురు ప్రముఖ వక్తలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వర్చువల్ పద్ధతిలో ప్రదర్శను నిర్వహిస్తున్నారు. దక్షిణాఫ్రికా, చైనా, రష్యాల స్టాల్స్ తో పాటుగా, వర్చువల్ పద్ధతిలో పది స్టాల్స్.ను కూడా ఏర్పాటు చేశారు.

## నా కన్నీరు ఆగనంటుంది: షర్మిల ఎమోషనల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:దివంగత సీఎం వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన కూతురు, వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఓ ట్వీట్ పై సర్వత్ర ఆసక్తికర చర్చ జరుగుతోంది. తాను ఒంటరి అంటూ ఆమె ఎమోషనల్ ట్వీట్ చేశారు. 'ఒంటరి దానినైనా విజయం సాధించాలని.. అవమానాలెదురైనా ఎదురీదాలని.. కష్టాలెన్నైనా ధైర్యంగా ఎదుర్కోవాలని.. ఎప్పుడూ ప్రేమనే పంచాలని, నా వెన్నంటి నిలిచి, ప్రోత్సహించి నన్ను మీ కంటిపాపలా చూసుకొన్నారు. నాకు బాధొస్తే మీ కంట్లోంచి నీరు కారేది.. ఈ రోజు నా కన్నీరు ఆగనంటుంది. ఐ లవ్ డ మిస్ యూ డాడీ' అని షర్మిల ట్వీట్ చేశారు. అయితే, తాను ఒంటరిగా ఫీలవుతున్నాననే విషయాన్ని ఈ ట్వీట్ రూపంలో వైఎస్ షర్మిల చెప్పకనే చెప్పారు. ఆమె ట్వీట్ పై సర్వత్ర ఆసక్తికర చర్చ జరుగుతోంది.

ఏపీ సీఎం జగన్ ? షర్మిల మధ్య ఉన్న గ్యాప్ ఆమె ట్వీట్ తో మరోసారి రుజువు అయిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. గత కొంత కాలంగా అన్న చెల్లి అయిన జగన్, షర్మిల మధ్య గ్యాప్ ఉంది. ఇద్దరూ కలిసి ఈ గ్యాప్ లో ఎక్కడా ఒకే వేదిక మీదకు రాలేదు. దీంతో గురువారం వైఎస్ వర్ధంతి సందర్భంగా అయినా ఇద్దరూ కలిసి తండ్రికి నివాళి అర్పిస్తారా లేదా అనే ఆసక్తి నెలకొని ఉంది. అయితే, సీఎం జగన్, షర్మిల, విజయమ్మ, భారతి సహా కుటుంబ సభ్యులంతా ఒకే సారి వైఎస్సార్ ఘాట్ కు వచ్చారు. అందరు కలిసి నివాళి అర్పించి.. అక్కడ జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. కానీ, జగన్ ? షర్మిల ఒకరిని ఒకరు పలకరించుకున్న సందర్భం అయితే కనిపించ లేదు. దీంతో షర్మిల తాజా ట్వీట్ కి ప్రాధాన్యత ఏర్పడింది.

# కేంద్ర పౌరసరఫరాల కార్యదర్శితో మంత్రి గంగుల భేటీ

హైదరాబాద్ , సెప్టెంబర్ 2:ఢిల్లీ పర్యటనలో మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్ బుధవారం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసి, రాష్ట్ర అంశాలపై వినతిపత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. స్పందించిన ఆయన.. అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆహార పౌరసరఫరాల కార్యదర్శి సుదాన్ను పాండేను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం మంత్రి గంగుల, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కమిషనర్ అనిల్‌కుమార్ ధాన్యం సమస్యలపై ఢిల్లీ కృషి భవన్‌లో పాండేతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మూడు ప్రధాన సమస్యలపై సమగ్ర వివరాలు అందించారు.

ఈ యాసంగిలో పారాబాయిల్డ్ రైస్ 50లక్షల మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐ తీసుకొని రైతులకు మేలు చేయాలని, గతంలో 2019-20 రబీలో నష్టపోయిన 30 రోజుల్ని భర్తీ చేసి మిగిలిన బియ్యాన్ని అందించడానికి మరో 30 రోజుల గడువుని పెంచాలని కోరారు. రాబోయే వానాకాలంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతించాలని కోరారు.



గతంలో సైతం ఇదే రీతిన కొనుగోళ్లు జరిగాయని వాటికి సంబంధించిన గణాంకాలను కేంద్ర కార్యదర్శికి మంత్రి అందజేశారు.

ఆయా అంశాలపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శితో సమగ్రంగా చర్చించిన మంత్రి గంగుల, తెలంగాణలో మిల్లింగ్ కొనసాగుతున్నందున సత్వర పరిష్కారం కోసం వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి గంగుల విజ్ఞప్తి మేరకు కేంద్ర కార్యదర్శి మధ్యాహ్నం ఎఫ్‌సీఐ ఉన్నతాధికారులు, రాష్ట్ర అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. తద్వారా అన్ని సమస్యలకు సత్వర పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రధానమంత్రి మోదీ "ఆత్మ నిర్భర్ భారత్" సాధించడానికి శాస్త్ర, సాంకేతికత కీలకమని పేర్కొన్న - కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

హైదరాబాద్ , సెప్టెంబర్ 2:ప్రధానమంత్రి మోదీ "ఆత్మ నిర్భర్ భారత్" సాధించడానికి శాస్త్ర, సాంకేతికత కీలకమని, కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ (స్వతంత్ర బాధ్యత) సహాయ మంత్రి; భూ విజ్ఞాన శాఖ (స్వతంత్ర బాధ్యత) సహాయ మంత్రి; ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా పిర్యాదులు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి, డాక్టర్ జితేంద్ర సింగ్, ఈ రోజు పేర్కొన్నారు. సాంకేతికాభివృద్ధి మండలి, టి.డి.బి., 25వ వ్యవస్థాపక దినోత్సవంలో, ఆయన, ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, నూతన అంకురసంస్థలకు, అవి కోరినప్పుడు మద్దతు ఇవ్వడంతో పాటు, వాటి అవసరాలను ముందుగానే తెలుసుకుని సహకారం అందించాలని నొక్కి చెప్పారు. విజయవంతమైన ఉత్పత్తి అభివృద్ధి కోసం తప్పనిసరిగా ప్రారంభ పర్యావరణ వ్యవస్థను కనుగొని, పెంపొందించుకోవాలని ఆయన, టి.డి.బి.ని కోరారు.

దేశంలో ప్రతిభావంతులైన మానవ వనరుల బృందానికి కొరత లేనప్పటికీ, కొత్త నమూనాలను అభివృద్ధి చేయడానికి దాన్ని మార్చడం ప్రధాన సవాలుగా ఉందని, డాక్టర్ జితేంద్ర సింగ్ అభిప్రాయపడ్డారు. స్వావలంబన యొక్క విశ్వాసం తదుపరి తరానికి చేరుతుందనీ, శాస్త్ర, సాంకేతిక రంగంలో అత్యుత్తమ ప్రతిభావంతులను ఆకర్షించడంలో ఇది సహాయపడుతుందనీ, ఆయన, పేర్కొన్నారు.

75 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి చేసిన ప్రసంగాన్ని, డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావిస్తూ, "75వ భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన్ని మనం కేవలం ఒక వేడుకగా జరుపుకోడానికి మాత్రమే పరిమితం చేయకూడదు. మనం కొత్త తీర్మానాలకు పునాది వేసి, సరికొత్త తీర్మానాలతో ముందుకు సాగాలి. ఇక్కడి నుండి ప్రారంభించి, భారత స్వాతంత్ర్యం శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే వచ్చే 25 సంవత్సరాల మొత్తం ప్రయాణం, ఒక నూతన భారతావనికి సంబంధించిన అమృత కాలాన్ని సూచిస్తుంది.", అని పేర్కొన్నారు. రాబోయే 25 సంవత్సరాలకు సంబంధించిన భవిష్యత్ ప్రణాళిక అన్ని రంగాల్లోని శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణల ద్వారా నిర్ణయించబడుతుందని, ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో నీతీ ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె. సారస్వత్; డి.ఎస్.ఐ.ఆర్. కార్యదర్శి, డా.శేఖర్ సి. మండే; సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్; టి.డి.బి. బోర్డు సభ్యులు; డి.బి.టి. కార్యదర్శి; శ్రీమతి రేణు స్వరూప్; టి.డి.బి., ఐ.పి. & టి.ఏ.ఎఫ్.ఎస్. కార్యదర్శి, శ్రీ రాజేష్ కుమార్ పాఠక్; సాంకేతికాభివృద్ధి మండలి డైరెక్టర్, శ్రీ రాజేష్ జైన్; శాస్త్ర, సాంకేతిక విభాగం మాజీ కార్యదర్శి, ప్రొఫెసర్ అశుతోష్ శర్మ; భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారుడు ప్రొఫెసర్ కె. విజయ్ రాఘవన్ ప్రభృతులు దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొన్నారు. కాగా, భారత్ బయోటెక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ కృష్ణ ఎల్ల; యువ పారిశ్రామికవేత్త, కో-ల్యాబ్ సహ వ్యవస్థాపకురాలు మరియు సి.ఓ.ఓ. శ్రీమతి అక్షత కరి ఈ సమావేశానికి ప్రత్యక్షంగా హాజరై, సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

25 సంవత్సరాల టి.డి.బి. విజయవంతమైన ప్రస్థానాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసిస్తూ, ప్రధానమంత్రి ఆశయాలకు అనుగుణంగా, నూతన భారత దేశ భవిష్యత్తు కోసం కృత్రిమ మేధస్సు, ఖగోళ శాస్త్రం, డేటా సైన్స్, సౌర విద్యుత్తు, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్, క్వాంటం కంప్యూటింగ్, వాతావరణ మార్పు, ఉపశమన సాంకేతికతలు, సైబర్ ఫిజికల్ విధానాల వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో, భారత దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దడానికి వచ్చే 25 సంవత్సరాలకు సంబంధించి బృహత్ ప్రణాళిక రూపొందించాలని కోరారు. కేంద్ర మంత్రి ఈ సందర్భంగా టి.డి.బి. ప్రత్యేక సంచికను కూడా విడుదల చేశారు.

సాంఘిక ప్రయోజనాల కోసం శాస్త్ర, సాంకేతికతను ఉపయోగించుకోవాలన్న ప్రధానమంత్రి ప్రబోధాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావిస్తూ, భారతదేశ అణు శక్తి కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమే ఉంటుందని డాక్టర్ భాభా ప్రపంచానికి ప్రకటించినప్పుడు మన పూర్వీకులు దీనిని ఊహించారని, పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కువ కాలం నిల్వ చేయడానికి వీలుగా చేసే ప్రక్రియలో వికిరణ ప్రక్రియ చాలా ప్రభావవంతంగా ఉంటుందని ఆయన తెలియజేశారు. అదే విధంగా, కోవిడ్ సంక్షోభం తీవ్రంగా ఉన్న సమయంలో అణుశక్తి విభాగం పునర్వినియోగానికి వీలైన పి.పి.ఈ. సామాగ్రిని అభివృద్ధి చేసిందని, ఆయన గుర్తుచేశారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ తమ ప్రసంగాన్ని ముగిస్తూ, శాస్త్ర, సాంకేతికతకు చెందిన అన్ని రంగాల్లో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందనీ, భారతదేశంలోని ప్రతి ఇంటిలో సాంకేతికత ప్రవేశించిందనీ, వ్యాఖ్యానించారు. మెజారిటీ భారతీయ పౌరులు "సులభంగా జీవించడాన్ని" ఆస్వాదించడానికి సహాయపడటం ద్వారా నిజమైన విజయం నిర్ణయించబడుతుందని ఆయన పేర్కొన్నారు.

డాక్టర్ వి.కె. సారస్వత్ ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హయాంలో భారతదేశంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్‌డిఐ) పర్యావరణ వ్యవస్థ మారిపోయిందనీ, ఇప్పుడు ట్రాన్స్‌లేషనల్ పరిశోధన మరియు వాణిజ్యీకరణపై ఎక్కువ దృష్టి పెట్టడం జరుగుతుందనీ, పేర్కొన్నారు. భారతదేశంలో ప్రస్తుతం 5,000 కంటే ఎక్కువగా అంకుర సంస్థలు పనిచేస్తున్నాయనీ, వాటిలో దాదాపు 50 సంస్థలు మహిళా పారిశ్రామికవేత్తల నేతృత్వంలో ఉన్నాయనీ, ఆయన చెప్పారు. బహుళజాతి కంపెనీలు కూడా భారతీయ ఆవిష్కరణల కోసం నిధులు సమకూర్చడం ప్రారంభించి, భారతదేశంలో పరిశోధనా, అభివృద్ధి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నాయనీ, ఇది స్వాగతించదగిన మార్పు అనీ, డాక్టర్ సారస్వత్, పేర్కొన్నారు.

భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారుడు, ప్రొఫెసర్ కె. విజయ్ రాఘవన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "టి.డి.బి. కీలక పాత్ర పోషిస్తూనే ఉందనీ, మన పర్యావరణ వ్యవస్థలో కొత్త రకాల ఆవిష్కరణలను పెంపొందించవచ్చునని నిరూపించింది." అని పేర్కొన్నారు.

శాస్త్ర, సాంకేతిక శాఖ మరియు జీవ సాంకేతిక విజ్ఞాన శాఖ కార్యదర్శి, డాక్టర్ రేణు స్వరూప్, మాట్లాడుతూ, ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థలో టి.డి.బి. కీలక పాత్ర కోసం చేసిన కృషిని నొక్కి చెప్పారు. డి.ఎస్.ఐ.ఆర్. కార్యదర్శి మరియు సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్ మరియు టి.డి.బి. బోర్డు సభ్యుడు, శేఖర్ సి మండే మాట్లాడుతూ, టి.డి.బి. చేపట్టిన ప్రయత్నాలు, కార్యక్రమాలతో పాటు, భారతదేశ భవిష్యత్తు కోసం వాటి ప్రాముఖ్యత గురించి నొక్కి చెప్పారు. డి.ఎస్.టి. మాజీ కార్యదర్శి, ప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ, సమాజ ప్రయోజనం కోసం, శాస్త్ర, సాంకేతికత, ఆవిష్కరణల్లో నూతన మరియు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలను ఉపయోగించుకోవడంలో టి.డి.బి పాత్ర గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు.

# తండ్రి వైఎస్ సమాధి సాక్షిగా.. జగన్, షర్మిల కలిసిన వేళ..



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలో ఆసక్తికర దృశ్యం కనిపించింది. ఏపీ సీఎం వైఎస్ జగన్.. ఆయన సోదరి వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు షర్మిల కలుస్తారా? లేదా? అన్న ఉత్కంఠకు తెరపడింది. తండ్రి వైఎస్ వర్ధంతి అన్న జగన్, చెల్లి షర్మిలను ఒక వేదికపైకి తీసుకొచ్చింది.

రాజకీయ విభేదాలతో అన్న జగన్, చెల్లి షర్మిల ఇద్దరూ దూరం దూరంగా ఉంటున్నారు. ఎవరి పార్టీని వారు చూసుకుంటున్నారు. అయితే ఇద్దరి మధ్య కేవలం రాజకీయ విభేదాలే కాదు.. వ్యక్తిగతంగా కూడా దూరం ఉందంటూ చాలా రోజుల నుంచి ప్రచారంలో ఉంది. జులై 8న వైఎస్ జయంతి సందర్భంగా ఇద్దరూ వేర్వేరుగా తండ్రి సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. దీంతో వీరి మధ్య విభేదాలు ఉన్నట్లు బహిర్గతమైంది. ఇటీవల రాఖీ పండుగ రోజున కూడా షర్మిల అన్నకు రాఖీ కట్టలేదు. కేవలం సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు మాత్రమే చెప్పారు. దీంతో ఇద్దరి మధ్య గ్యాప్ నిజమేనని స్పష్టమైంది. అయితే ఇవాళ వైఎస్ఆర్ 12వ వర్ధంతి.. ఈ సందర్భంగా అయినా ఇద్దరు కలుస్తారా..? లేక ఎవరికి వారే అన్నట్లుగా ఉంటారా? అన్నది అందరిలో ఆసక్తి పెంచింది.

ఈ క్రమంలో ఇడుపులపాయలోని తండ్రి ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అన్న జగన్, చెల్లి షర్మిల ఒకే వేదికపైకి వచ్చారు. ఇద్దరూ కలిసే వైఎస్సార్‌ను నివాళి అర్పించారు. వైఎస్ విజయమ్మ, వైఎస్ షర్మిల, వైఎస్ భారతి నివాళులర్పించారు. వైఎస్సార్‌ను స్మరించుకుంటూ మౌనం పాటించారు. ప్రార్థనల్లో జగన్, షర్మిల ఇద్దరూ పక్క పక్కనే ఉన్నా.. పలకరించుకోలేదు. అయితే, చాలా రోజుల తర్వాత అన్న చెల్లి ఒకే వేదికపై కనిపించడంతో వైసీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి.

# ఢిల్లీకి చేరిన టీఆర్ఎస్ ప్రస్థానం.. గర్వంగా ఉందన్న మంత్రి ప్రశాంత్ రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:ఢిల్లీలోని వసంత్ విహార్‌లో తెలంగాణ భవన్‌కు భూమిపూజ చేయడం గొప్పగా, ఆనందంగా, గర్వంగా ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌కు భూమి పూజ కార్యక్రమం ముగిసిన అనంతరం మంత్రి ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

2001లో ఒక్క అడుగుతో ప్రారంభమైనటువంటి టీఆర్ఎస్ పార్టీ ప్రస్థానం.. ఈ 20 ఏండ్లలో అంచెలంచెలుగా ఎదిగి ఢిల్లీ నగరం నడిబొడ్డుకు చేరింది అని చెప్పారు. ఇవాళ ఢిల్లీ నగరం నడిబొడ్డుపైన గులాబీ జెండాను ఎగురవేయడం మరిచిపోలేని విషయమన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ పనితీరును దేశం నలుమూలల తెలియజేయాల్సిన బాధ్యత టీఆర్ఎస్ పార్టీపై ఉందన్నారు. అందుకు ఢిల్లీలో నిర్మించబోయే తెలంగాణ భవన్ ఒక వేదిక కాబోతుందని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఢిల్లీ అధికారులు, పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

# సరుకు రవాణా పరంగా ఆగస్టు 2021లో అత్యున్నత స్థాయిని సాధించిన భారతీయ రైల్వేలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:కోవిడ్ సవాళ్ళు నేపథ్యంలో కూడా ఆగస్టు 2021లో లోడింగ్, ఆదాయాల పరంగా భారతీయ రైల్వే సరుకు రవాణా గణాంకాలలో అత్యున్నత ప్రగతిని సాధించింది. ఆగస్టు 2020లో (94.59 మిలియన్ టన్నులు)తో పోలిస్తే ఆగస్టు 2021లో 110.55 మిలియన్ టన్నులను భారతీయ రైల్వేలు సరుకు రవాణా చేసింది. ఆగస్టు 2020లో రూ.9,043.44 కోట్ల ఆదాయంతో పోలిస్తే ఆగస్టు 2021లో 10,866.20 కోట్ల ఆదాయాన్ని సరుకు రవాణా ద్వారా భారతీయ రైల్వే ఆర్జించింది. ఇది గత ఏడాదికన్నా 20.16 శాతం ఎక్కువ.

ఆగస్టు 2021లో రవాణా చేసిన వస్తువులలో 47.94 మిలియన్ టన్నుల బొగ్గు, 13.53 మిలియన్ టన్నుల ఇనుపధాతువు, 5.77 మిలియన్ టన్నుల పెళుసు ఇనుముడ మెరుగుపెట్టిన ఉక్కు, 6.88 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు, 4.16 మిలియన్ టన్నుల ఫర్టిలైజర్లు, 3.60 మిలియన్ టన్నుల మినరల్ ఆయిల్, 6.3 మిలియన్ టన్నుల సిమెంట్ (శిలాద్రవం – క్లింకర్ మినహా), 4.51 మిలియన్ టన్నుల శిలాద్రవం ఉన్నాయి.

రైల్వేల ద్వారా సరుకు రవాణాను మరింత ఆకర్షణీయం చేయడం కోసం భారతీయ రైల్వేలు అనేక రాయితీలను / డిస్కౌంట్లను అందిస్తోంది. ప్రస్తుతమున్న నెట్‌వర్క్‌లో సరుకు రవాణా రైళ్ళ వేగాన్ని పెంచారు. సరుకు రవాణా వేగాన్ని మెరుగుపరచడమన్నది అందరు భాగస్వాములకు వ్యయాన్ని ఆదా చేస్తుంది. సరుగకు రవాణా రైళ్ళు గత 19 నెలల్లో రెండింతలు అయ్యాయి.

కోవిడ్ 19 మహమ్మారిని మొత్తం సామర్థ్యాలను, పనితీరును మెరుగుపరచే అవకాశంగా భారతీయ రైల్వేలు ఉపయోగించుకుంది.

# నేడు మరో 15 స్కూల్ బస్సులు సీజ్

హైదరాబాద్ , సెప్టెంబర్ 2:కరోనా కారణంగా ఏడాదిన్నర తర్వాత విద్య సంస్థలు తెరుచుకోవడంతో ఫిటినెస్ లేని స్కూల్ బస్సులపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో నిన్న 12 స్కూల్ బస్సులను సీజ్ చేసిన అధికారులు ఇవాళ మరోసారి తనిఖీలు నిర్వహించి మరో 15 బస్సులను సీజ్ చేశారు. నార్సింగీ, కొండాపూర్, చేవెళ్ళతో పాటు శంషాబాద్ లో తనిఖీలు నిర్వహిస్తుంది అధికారుల బృందం. అయితే నిన్న 12 బస్సులను సీజ్ చేసిన అధికారులు నేడు నిబంధనలు పాటించని మరో స్కూల్ 15 బస్సులను సీజ్ చేసారు రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు. స్కూల్ బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్, రోడ్డు ట్యాక్స్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్స్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు విద్యార్థుల సామర్థ్యం పై ప్రత్యేక నిఘా పెట్టారు అధికారులు

# బడులను పరిశీలించిన అదనపు కలెక్టర్



భీమ్‌గల్, సెప్టెంబర్ 2:: భీమ్‌గల్ మండలంలోని బడా భీమ్‌గల్, సికింద్రాపూర్, గోనుగోపుల గ్రామాల్లో గురువారం అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలలను ఆమె పరిశీలించారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవటంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంపీడీవో రాజేశ్వర్, ఆయా గ్రామాల సర్పంచులు సంజీవ్, గంగాధర్, అనసూయ, ఈసీ ప్రశాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 2022లో అధికార పగ్గాలు చేపడతామన్న అఖిలేష్!

లక్నో, సెప్టెంబర్ 2:: వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు సాధించి అధికార పగ్గాలు చేపడతామని ఎస్పీ చీఫ్, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. యోగి ఆదిత్యానాథ్ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు కాకపోగా, గ్యాస్ సిలిండర్ల ధరలు మాత్రం రెట్టింపయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

2022 యూపీ ఎన్నికల్లో మనం 400కు పైగా స్థానాలు దక్కించుకుంటామని అఖిలేష్ పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ చెబుతున్న అసత్యాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు.కరోనా సహా రాష్ట్రంలో పలు వ్యాధులు ప్రబలుతున్నా యోగి సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇక పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం చూస్తుంటే ఎస్పీ జయకేతనం ఎగురవేస్తుందనేందుకు సంకేతాలు వెల్లడవుతున్నాయని పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఈటల రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్దంగా ఉండాలి: బాల్క సుమన్

హైదరాబాద్ , సెప్టెంబర్ 2:మాజీ మంత్రి ఈటలు కౌంటరిచ్చారు ప్రభుత్వ విప్ బాల్క సుమన్. ఈటల రాజేందర్ శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకోవడానికి మానసికంగా ఇప్పటి నుండే సిద్ధం కావాలి. దమ్ముంటే కేసీఆర్, హరీష్ రావు నామీద పోటీ చేయాలనే స్థాయి ఈటల రాజేందర్ కు లేదు అని తెలిపారు. కేసీఆర్ ఆరు సార్లు టిక్కెట్లు ఇస్తే ఎమ్మెల్యేగా గెలిచాడు రెండు సార్లు మంత్రి గా చేశాడని విమర్శించారు. ప్రజాస్వామ్యం మీద ఈటలకు నమ్మకం ఉంటే మందు బాటిల్ పొట్లేళ్ల పంపకాలు ఆపాలి అన్నారు. చెప్పేటివి శ్రీరంగనీతులు చేసేది ఏమో అది అన్నట్టుంది అని పేర్కొన్నారు.

ఈటల ఆస్తులు కాపాడుకోవడానికి కాపాడుకోవడానికే బీజేపీ పార్టీలోకి చేరాడని విమర్శించాడు బాల్క సుమన్. ఆనాడు టీఆర్ఎస్ పార్టీలో ఉండి బిజెపి పార్టీ ని విమర్శించిన నువ్వు ఆ పార్టీలో ఎలా చేరావు అని ప్రశ్నించారు. నికార్సైన తెలంగాణ ఉద్యమకారుడు గెల్లు శ్రీనివాస్ నిన్ను ఖచ్చితంగా ఓడిస్తాడు. ఇక ఈటల రాజేందర్ అన్న మాటకు కట్టుబడి ఉండాలి ఎక్కడ వెనుకడుగు వేయకూడదు శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్దంగా ఉండాలి అని స్పష్టం చేసారు.

# వరంగల్ హత్య కేసులో ఆరుగురి అరెస్ట్




హనుమకొండ, సెప్టెంబర్ 2:: నగరంలోని ఎల్బీనగర్ హత్య కేసులో నిందితులను పోలీసులు గురువారం మీడియా ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా సీపీ తరుణ్ జోషి వివరాలు వెల్లడించారు. ముగ్గురి హత్య కేసులో ఆరుగురు నిందితులు మహమ్మద్ షఫీ, బోయిని వెంకన్న, ఎండీ సాజిద్, రాగులు విజేందర్, ఎండీ మీర్జా అక్బర్, ఎండీ పాషా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో మృతుడు అన్న చంద్ పాషా, హత్యకు పాల్పడిన ప్రధాన నిందితుడు తమ్ముడు షఫీ మధ్య పశువుల కొనుగోలు, ఆస్తి తగాదాలు ఉన్నాయని తెలిపారు. నిందితుల నుంచి వేట కత్తులు, కోత మిషన్, రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని సీపీ వివరించారు.

# అట్టహాసంగా గులాబీ జెండా పండుగ.. సిద్దిపేటలో పాల్గొన్న మంత్రి హరీశ్



సిద్దిపేట , సెప్టెంబర్ 2: రాష్ట్రవ్యాప్తంగా గులాబీ జెండా పండుగను టీఆర్ఎస్ శ్రేణులు అట్టహాసంగా నిర్వహించాయి. పల్లెపల్లెనా, వాడవాడనా నేతలు టీఆర్ఎస్ జెండాలను ఎగుర వేసి.. మిఠాయిలు పంచిపెట్టారు. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని జరిగిన వేడుకల్లో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పాల్గొని, టీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. 4వ, 23, 24వ వార్డుల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లాలో జరిగిన వేడుకల్లో మాజీ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు. 48వ వార్డులో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరవీరులకు జోహార్లు అర్పించారు. అనంతరం గుత్తా మాట్లాడుతూ రాష్ట్రంలోని యావత్ పార్టీ శ్రేణులకు, నాయకులకు జెండా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలో పార్టీ కార్యాలయ శంకుస్థాపన జరుపుకోవడం శుభపరిణామమన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నడిపిస్తున్న కేసీఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ పటిష్టతకు సంస్థాగత నిర్మాణం ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, వార్డ్ కౌన్సిలర్ యామ కవితదయాకర్, సీనియర్ నాయకులు బోయినపల్లి కృష్ణా రెడ్డి, యామ దయాకర్, పిచ్చయ్య, మైనం శ్రీనివాస్, తూముల రవీందర్ రావు, అనిస్ బాయ్, మనోహర్, హరికృష్ణ, రఘుపతి, కొండూరి సత్యనారాయణ, మధుసూదన రెడ్డి, ఆలయ చైర్మన్ వేణుగోపాల్, వేదాంతం శ్రీనివాస్ చార్యులు,రమేశ్ పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లా చొప్పదండిలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ టీఆర్ఎస్ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా గులాబీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో తిరుగులేని రాజకీయశక్తిగా టీఆర్ఎస్ పార్టీ ఎదిగిందని తెలిపారు. సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు జెండా పండుగ చొప్పదండిలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా గులాబీ శ్రేణులు జెండా పండుగను నిర్వహించాయి. వాడవాడనా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో టీఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగుర వేసి సంబురాలు జరుపుకున్నారు. తంగళ్లపల్లి మండలంలోని 30 గ్రామాల్లోనూ నేతలు జెండాను ఎగుర వేశారు. వేములవాడ మండలం ఆరేపల్లిలో కార్యకర్తలు జెండాను ఆవిష్కరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వేడుకలు జరిగాయి. టీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి తోట ఆగయ్య, నేతలు పాల్గొన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనూ నేతలు పార్టీ జెండా ఎగురా వేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ కళ తదితరులు పాల్గొన్నారు.జగిత్యాల జిల్లాలో పార్టీ శ్రేణులు జెండా పండుగ అట్టహాసంగా నిర్వహించాయి. సారంగపూర్‌లో జెండా వేడుకల్లో పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాయికల్‌లో మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు పాల్గొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న శ్రేణులు జెండాను ఎగుర వేశారు. మహబూబాబాద్ వ్యాప్తంగా జెండా పండుగ జరిగింది. గ్రామాలు, పట్టణాల్లో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని జెండాను ఎగుర వేశారు. పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా పండుగ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

